ముంచెత్తుతోంది

- పారిశుధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం
- వర్షాలకు ఎక్కడికక్కడ పేరుకున్న వ్యర్థాలు
- వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్న ప్రజలు

వర్షాకాలం వస్తే చాలు పట్టణాలు, గ్రామాలన్న తేడా లేకుండా జనం వ్యాధుల బారిన పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేకపోవడం ఓ కారణమైతే, ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలు మరో కారణం. ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోతున్నా, సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.



అధ్వానంగా ఉన్న తుని మార్కెట్ యార్డు ప్రాంతం

తుని: మెట్టలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో తుని మున్సిపాలిటీ, ఏలేశ్వరం నగర పంచాయతీ, 168 పంచాయతీలు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 6.79 లక్షల మంది జనాభా ఉన్నారు. మేజర్ పంచాయతీలకు ఇద్దరు, ముగ్గురు పారిశుధ్య సిబ్బంది ఉండగా, పంచాయతీలకు ఒక్కరూ లేరు. తుని పట్టణానికి సంబంధించి 60 వేలకు పైగా జనాభా ఉండగా, 100 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. రోజుకు పట్టణంలో 22 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని తరలించేందుకు అవసరమైన ట్రాక్టర్లు, డంపర్లు, ఈ-ఆటోలు ఉన్నప్పటికీ, వర్షాల కారణంగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా, తుని మార్కెట్ యార్డులోని రైతు బజార్, మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్, పంచాయతీల్లోను వ్యర్థాలు పేరుకుపోయాయి. వీటి నుంచి వచ్చే దుర్వాసనను ప్రజలు భరించలేకపోతున్నారు. మార్కెట్‌లోకి వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి.

మురికివాడల్లో వ్యాధుల భయం

మున్సిపాలిటీలతో పాటు, గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తున్నా, కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా పట్టణ, రూరల్ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ తదితర వ్యాధులతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యర్థాలు పేరుకుపోవడంతో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వీటి కారణంగా పట్టణ పరిధిలో డ్రైవర్స్ కాలనీ, రెల్లికాలనీ, కొండవారిపేట, అమ్మాజీపేట, సాయినగర్, మార్కండ్రాజుపేట, వైఎస్సార్ కాలనీ, రామకృష్ణాకాలనీ, ఇసుకపేట, వీరవరపుపేట తదితర ప్రాంతాల్లో వ్యాధుల బారిన పడుతున్న వారు ఎక్కువగా ఉన్నారు. ఇందులో కొందరు అర్బన్ హెల్త్ సెంటర్, ఏరియా, ప్రైవేటు ఆస్పత్రులు, పీహెచ్‌సీలను ఆశ్రయిస్తున్నారు.

సమన్వయ లోపం

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడడం ప్రజల పాలిట శాపంగా పరిణమించింది. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో మూడు వ్యవసాయి మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఇందులో ప్రధానమైన తుని వ్యవసాయ మార్కెట్ యార్డులో 15 ఏళ్ల క్రితమే రైతు బజార్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోజూ రూ.లక్షల్లో కాయగూరల వ్యాపారం జరుగుతోంది. నిత్యం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాలతో పాటు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం నుంచి వ్యాపారులు తుని మార్కెట్‌కు వస్తుంటారు. రైతులు పండించిన కూరగాయలను కొనుగోలు చేసి ఆయా ప్రాంతాలకు తరలిస్తారు. దీంతో తుని కాయగూరల మార్కెట్‌కు ప్రసిద్ధి. ఏటా రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. మార్కెట్ కమిటీకి సెస్ రూపంలో ఆదాయం సమకూరుతుంది. ఇంతవరకు బాగున్నా, చెత్త సేకరణ సమస్యగా మారింది. మార్కెట్ యార్డుకు పారిశుధ్య కార్మికులు లేరు. దీంతో స్థానిక మున్సిపాలిటీయే పారిశుధ్య నిర్వహణ చేస్తుంది. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో మున్సిపాలిటీకి పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో, మార్కెట్ యార్డు బయట వ్యర్థాలను మాత్రమే తొలగిస్తున్నారు. మార్కెట్ యార్డు లోపలకు వెళ్లడం లేదు. దీంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. మురుగులోనే రైతులు పండించిన కూరగాయలను విక్రయిస్తున్నారు.

సిబ్బంది కొరత ఉంది

పట్టణంలో రోజు వారీ పారిశుధ్య నిర్వహణకు 160 మంది సిబ్బంది అవసరం. ప్రస్తుతం 100 మంది మాత్రమే ఉన్నారు. వ్యర్థాలను తరలించేందుకు అవసరమైన వాహనాలున్నాయి. పట్టణంలో ప్రతి వార్డుకు ఐదుగురు కార్మికులు అవసరం. కానీ ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో పూర్తి స్థాయిలో విధుల నిర్వహణ కష్టంగా మారింది. తుని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న రైతు బజార్ వలన ఎక్కువ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని సేకరించే బాధ్యత కచ్చితంగా మార్కెట్ కమిటీ తీసుకోవాలి. ఇందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి. మార్కెట్‌లో వ్యర్థాలను అక్కడే వదిలి వేస్తున్నారు. దీంతో మార్కెట్ ప్రాంగణం వ్యర్థాలకు నిలయంగా మారింది. మార్కెట్ యార్డులో డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖకు సూచించాం. పట్టణంలో చెత్త సేకరణతో పాటు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నాం.

– శేఖర్, ప్రజా ఆరోగ్యాధికారి, తుని మున్సిపాలిటీ

రోగాల బారిన పడుతున్నాం

ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురవడంతో చెత్త పేరుకుపోయి వ్యాధుల బారిన పడుతున్నాం. మార్కెట్‌కు వెళితే చాలు దుర్వాసన భరించలేకపోతున్నాం. అధికార యంత్రాంగం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నారే మినహా, క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. మార్కెట్ కమిటీ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేసి, చెత్త సమస్యను పరిష్కరించాలి.

– వెంకట రమణ, రైతు, తుని

పంటలను పరిశీలించిన డీడీ



మురారిలో రైతులతో మాట్లాడుతున్న డీడీ శ్రీహరి



ఎస్.చామవరంలో పత్తి రైతులకు సూచనలిస్తున్న ఏఓ అశోక్‌కుమార్

గండేపల్లి: నీట మునిగిన పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీహరి రైతులకు సూచించారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని మురారిలో నీట మునిగిన పంటలను అధికారులు, రైతులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి పంటలను సంరక్షించుకోవాలన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఏఓ సంజీవ్, పలువురు రైతులు ఉన్నారు.

పత్తిలో గులాబీ పురుగుల నివారణ

తుని రూరల్: అధిక వర్షాలతో పదునెక్కిన పత్తి చేలను ఆకర్షించే గులాబీ పురుగులను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ బి.అశోక్‌కుమార్ రైతులకు సూచించారు. తుని మండలం ఎస్.చామవరం, ఎస్.అన్నవరం గ్రామాల్లో సాగవుతున్న పత్తి పైర్లను వీఆర్వో గోపితో కలిసి పరిశీలించారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు పత్తి చేలు ముంపునకు గురయ్యాయన్నారు. నేలలో అధిక తేమ వలన పత్తి పైర్లను గులాబీ పురుగులు ఆశిస్తాయన్నారు. నెల రోజుల పంటలో గుడ్లు పెట్టి, పంటకు నష్టం కలిగిస్తాయన్నారు. ఈ పురుగులను గుర్తించేందుకు ఎకరాకు ఎనిమిది లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. 75 రోజుల తర్వాత ఐదు మి.లీ. వేపనూనెను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఉధృతి తగ్గుతుందన్నారు.

హమ్మయ్యా.. తెరిపినిచ్చిన వర్షం

తొండంగి: అల్పపీడనం ప్రభావంతో మండలంలో ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం మంగళవారం కాస్త తెరిపినిచ్చింది. నిరంతరాయంగా కురిసిన వర్షం కారణంగా దైనందిన కార్యక్రమాలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భవన నిర్మాణ, ఇటుక బట్టీల కార్మికుల పనులకు, చిరు వ్యాపారాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం వర్షం సమసినప్పటికీ, బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో పాటు, అల్పపీడనం ఏర్పడ్డాయని, దీని ప్రభావంతో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పటికే చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరాయి. మళ్లీ వర్షాలు అధికంగా కురిస్తే ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ముంచెత్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట ప్రాంతాల నుంచి వరదనీరంతా సముద్రంలో పాటుపోటుల కారణంగా మండలంలోని జమ్మేరు, అద్దరిపేట, వేమవరం, ఏవీ నగరం తదితర తీర ప్రాంతాల్లో రోజుల తరబడి నిలిచిపోతుంది. అతి వృష్టి వచ్చిన ప్రతిసారీ తొండంగి మండలానికి ముంపు సమస్య తీవ్రంగా ఉంటోంది. మెట్టలో వర్షాలు తొండంగి మండల రైతుల సాగు పనులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

తుని-నర్సీపట్నం రోడ్డు ఛిద్రం



కాకరాపల్లి శివారులో ఛిద్రమైన తుని-నర్సీపట్నం రోడ్డు

కోటనందూరు: విస్తారంగా కురిసిన వర్షాలకు మండలంలోని తుని-నర్సీపట్నం రోడ్డు ఛిద్రమైంది. ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు గుంతల్లోకి చేరడంతో, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. తాటిపాక, గొంపకొండ, పోలీస్‌స్టేషన్, కాకరాపల్లి శివారు ప్రాంతంలోని రోడ్డు గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

విద్యా రంగంపై చిన్నచూపు



ఐ ప్రసాదరావు

ప్రత్తిపాడు: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 3.25 శాతం మాత్రమే నిధులు కేటాయించడంపై ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కాకినాడ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ.ప్రసాదరావు మంగళవారం నాడిక్కడ అసంతృప్తి వ్యక్తం చేశారు. నేటికీ విద్యా రంగానికి 6 శాతం నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. వేతన జీవులకు ఆదాయ పన్నుల్లో కొత్త పద్ధతి (న్యూ రెజీమ్)లో పన్ను చెల్లించే వారికి మాత్రమే కొంత మేర ఉపశమనం కలిగించారన్నారు. పాత పద్ధతిలో ఉన్న వారికి కూడా రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



తుని ఆర్టీసీ డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

తుని: ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకులు బీవీ రమణ, కేఎస్ఎన్ రాజు, నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం తుని డిపో గేటు వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు ఓటీలు రద్దు చేసి అందరికీ ఆమోదయోగ్యమైన చార్టులు వేయాలని కోరారు. ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు వద్దని, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను కండక్టర్లుగా పంపవద్దన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై హర్షం

ప్రత్తిపాడు రూరల్: కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లను కేటాయించడంపై బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటవీరబాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు



ఒమ్మంగిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



గోకవరం డ్రైనేజీలో ఆయిల్ బాల్స్ విడిచిపెడుతున్న ప్రత్యేకాధికారి



రామవరంలో అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోకవరం: గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడుతున్నట్టు మండల ప్రత్యేకాధికారి ముఖలింగం అన్నారు. మండల కేంద్రమైన గోకవరంలో మంగళవారం ఆయన పర్యటించి, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా డ్రైనేజీల్లో దోమల లార్వా వ్యాప్తి చెందకుండా రూపొందించిన ఆయిల్ బాల్స్‌ను విడిచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందు, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు, పంచాయతీ ఉద్యోగులు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకిరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికలు తీయించి, గ్రామం నలుమూలలా బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ సత్తిబాబు కోరారు.

ఒమ్మంగిలో..

ప్రత్తిపాడు రూరల్: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి డీవీ రమణమూర్తి అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో స్వచ్ఛత వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపర్చడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ డేవిడ్ రాజు, విస్తరణాధికారి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తం

జగ్గంపేట: వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాట్రావులపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని రామవరంలో మంగళవారం ఆయన పర్యటించారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని చెప్పారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర పీడితులు, డయేరియా బాధితులు ఉంటే, వారిని ఆస్పత్రులకు తరలిస్తున్నారని వివరించారు. అలాగే గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నారా, స్వచ్ఛమైన నీరు సరఫరా చేస్తునారా అనేది పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

నాణ్యతతో కూడిన విద్యను అందించాలి

డీఈఓ కె.వాసుదేవరావు



రంపయర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో తనిఖీ చేస్తున్న డీఈఓ వాసుదేవరావు

గోకవరం: విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూళ్లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రంపయర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌ని 15 మంది హెచ్ఎంల బృందంతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, అటల్ టింకరింగ్ ల్యాబ్, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల ఆవరణ తదితర వాటిని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిరుమలాయపాలెంలో జెడ్పీ హైస్కూల్‌ని తనిఖీ చేశారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు వ్యవహరించాల్సిన అంశాలను తెలిపారు. ఆయన వెంట ఎంఈఓలు బి.గౌరమ్మ, చిమ్మరాజుదొర, హెచ్ఎంలు కోలా సత్యనారాయణ, ఎస్వీ సత్యనారాయణ, ప్రమీలారాణి, కె.లక్ష్మీకాంతం, గణపతిరావు, అప్పారావు, త్రినాథరావు, సుజాత, సూరిబాబు, శేషకుమారి, చక్రధర్ తదితరులు ఉన్నారు.

మహిళ, బాలికల చట్టాలపై అవగాహన



సదస్సులో అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

జగ్గంపేట: బాలికలు, మహిళా హక్కులు, రక్షణ చట్టాలపై మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు జరిగింది. జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో డీసీపీయూ కౌన్సిలర్ దుర్గారాణి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను వివరించారు. హెచ్ఎం టీవీఎస్ రంగారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

వేటకు పోటు

- అల్పపీడనం కారణంగా వేటకు తప్పని విరామం
- అల్లకల్లోలంగా సముద్రం



అల్పపీడనం ప్రభావంతో కొత్తచోడిపల్లిపేటలో కోతకు గురవుతున్న తీరం

తొండంగి: అల్పపీడనం ప్రభావంతో సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. కోన తీర ప్రాంతంతో పాటు, మెట్ట, పల్లపు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

తీరానికే బోట్లు పరిమితం

అల్పపీడనంతో చేపల వేటకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో వారం రోజుల నుంచి మత్స్యకారులంతా తమ బోట్లను తీరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించి, వేటకు విరామం ప్రకటించారు. తీరంలోని అన్ని గ్రామాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేశామని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కాగా మండలంలో దాదాపు 480 బోట్లు ఉన్నాయి. వేట ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. సముద్రంలో వేటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మత్స్య సంపదతో చిరు వ్యాపారాలు చేసే వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సముద్రంలో వేటకు అనుకూల పరిస్థితులు ఏర్పడే వరకూ ఈ ఇబ్బందులు తప్పవని తీర ప్రాంత మత్స్యకారులు వాపోతున్నారు.



పెరుమాళ్లపురం తీరంలో వేటకు వెళ్లకుండా నిలిచిన బోట్లు

కోతకు గురవుతున్న తీరం

సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో పాటు, పాటుపోట్ల కాలంలో సముద్రం ముందుకూ, వెనక్కూ వెళ్తొస్తుంటుంది. ఈ క్రమంలో సముద్ర తీర ప్రాంతం కోతకు గురవుతోంది. సముద్రంలో లక్షలాది టీఎంసీల నీరు అదనంగా చేరడంతో, క్రమంగా సముద్ర మట్టం పెరుగుతూ ఉంటుంది. ఈ ప్రభావంతో ఏటా తీరం కోతకు గురవుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఇప్పటికే ఉప్పాడ, మూలపేట తదితర ప్రాంతాల్లో ఊళ్లు సముద్రంలో కలిసిపోవడంతో తమ ఊరికి ముప్పు తప్పదని తీరప్రాంత మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తం చేశాం



అల్పపీడనం నేపథ్యంలో తీర ప్రాంతంలోని గ్రామాల మత్స్యకారులను అప్రమత్తం చేశాం. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో పాటు, చేపల వేటకు ఏమాత్రం అనుకూలం కాదు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు తీర ప్రాంత మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదు.

– సీహెచ్ ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, తుని

క్లుప్తంగా

26న నీటి విడుదలపై సమావేశం

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి నీటి విడుదలపై ఈ నెల 26న రైతులతో సమావేశం నిర్వహించనున్నట్టు తాండవ డీఈఈ పి.అనురాధ మంగళవారం తెలిపారు. నాతవరం సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో నీటి విడుదలపై రైతుల అభిప్రాయాలు సేకరించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి ఆయకట్టు రైతులంతా హాజరు కావాలని డీఈఈ కోరారు.

369.5 అడుగులకు చేరిన నీటిమట్టం

తాండవ జలాశయంలో నీటిమట్టం 369.5 అడుగులకు చేరిందని డీఈఈ అనురాధ తెలిపారు. అల్పపీడన ప్రభావంతో జలాశయానికి ఆశాజనకంగా నీటి నిల్వలు చేరాయన్నారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలతో ఆయకట్టు అవసరాలకు పుష్కలంగా నీరందించే అవకాశం ఉందన్నారు. రైతులు ధైర్యంగా నాట్లు వేసుకోవచ్చని సూచించారు.

వైభవంగా పాదాలమ్మ జాతర



క్యూలో నిలబడిన భక్తులు

తుని రూరల్: కొలిమేరు గ్రామ దేవత పాదాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. ఏటా ఆషాఢ మాసం మూడో మంగళవారం ఈ జాతర నిర్వహిస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు. గ్రామంలో భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయాన్ని, గ్రామ ప్రధాన రహదారిని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దుర్గాలమ్మకు బోనాల సమర్పణ



గోకవరంలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

గోకవరం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక సంజీవయ్యనగర్‌లో ఉన్న దుర్గాలమ్మకు మంగళవారం మహిళలు బోనాలు సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

కేజీబీవీలో బోధనోపకరణాల ప్రదర్శన



వి.కొత్తూరు కేజీబీవీలో రూపొందించిన బోధనోపకరణాలతో విద్యార్థినులు

తుని రూరల్: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తుని మండలం వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులు రూపొందించిన బోధనోపకరణాలను మంగళవారం ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ అమృతవాణి, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో అందుబాటులో ఉన్న వనరులతో బోధించేందుకు అవసరమైన వివిధ రకాల పరికరాలను విద్యార్థినులు తయారు చేశారు. ఇతర విద్యార్థినుల్లో అవగాహన కల్పించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయని వివరించారు.

అన్న సమారాధన

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్న సమారాధన జరిగింది. గ్రామస్తులు, భక్తుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

డివైడర్ ఎక్కిన వ్యాన్

గండేపల్లి: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జాతీయ రహదారిపై ఓ వ్యాన్ డివైడర్‌పైకి దూసుకెళ్లింది. హైవే భద్రత సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాజానగరం నుంచి విశాఖపట్నం వెళుతున్న వ్యాన్ గండేపల్లి శివారుకు వచ్చేసరికి డ్రైవర్ కునుకుపాట్లు పడ్డాడు. ఈ క్రమంలో వ్యాన్ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. సమీపంలో ఎటువంటి వాహనాలు లేకపోవడంతో ముప్పు తప్పింది.

పందుల బెడద

ఏలేశ్వరం: పట్టణంలో పందుల సంచారంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతుండడంతో అంటువ్యాధులతో పాటు, పందుల సంచారం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. స్థానిక దిబ్బలపాలెం, షిర్డీనగర్, తోటవీధి, పెద్దవీధి, పల్లపువీధి తదితర ప్రాంతాల్లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.